

అభివృద్ధి పనులపై సమీక్ష

తిరుమల: తిరుమల ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనుల పురోగతిపై టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి సమీక్షించారు.



త్వరలోనే పరిష్కరిస్తాం

తిరుపతితుడా: శెట్టిపల్లి భూ సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 75,740 మంది స్వామివారిని దర్శించుకోగా 34,958 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.84 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపరచడమే లక్ష్యం



విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న కలెక్టర్

తిరుపతి సిటీ: విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించి ఆరోగ్యాన్ని మెరుగు పరచడమే లక్ష్యంగా నులిపురుగుల మాత్రలు ప్రభుత్వం అందిస్తోందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం తిరుపతి అర్బన్ కొర్లగుంటలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల వయసు కలిగిన 4,97, 511 మంది విద్యార్థులకు ఈ మాత్రలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ పిల్లలకు ఆల్బెండజోల్ మందు బిళ్లలను మింగించడమే లక్ష్యంగా జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, స్కూల్ టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. డీఈఓ కేవీఎన్ కుమార్, ప్రోగ్రాం స్టేట్ నోడల్ ఆఫీసర్స్ డాక్టర్ శ్రీనివాస వర్మ, డాక్టర్ సౌజన్య లక్ష్మీ, డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, ఆర్బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రెడ్డి ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సింధు పాల్గొన్నారు.

మెరిట్ జాబితా విడుదల

తిరుపతి తుడా: జిల్లాలో ఖాళీగా ఉన్న 27 ఆశా వర్కర్ పోస్టుల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి మెరిట్ జాబితాను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రచురించడం జరిగిందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలకృష్ణనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో అభ్యర్థులకు ఎటువంటి అభ్యర్థనలు ఉన్నా ఈనెల 15 తేదీ సాయంత్రం 4 గంటల్లోపు తెలపాలని కోరారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



సదస్సులో ప్రసంగిస్తున్న వీసీ ఉమ

తిరుపతి రూరల్: ర్యాగింగ్ వల్ల ఎంతోమంది అమాయకులు మానసిక వేదన అనుభవిస్తారని యూనివర్సిటీ వీసీ ఆచార్య వి.ఉమ తెలిపారు. మంగళవారం శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నేషనల్ యాంటీ ర్యాగింగ్ డే సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్ విద్యార్థినులకు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. అంతేకాక ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై తీసుకునే కఠిన చర్యలు ఉంటాయన్నారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఉషారాణి, హాస్టల్ వార్డెన్ ప్రొఫెసర్ జి.సావిత్రి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఐవీ లలితకుమారి ర్యాగింగ్ నియంత్రణకు నిత్యం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. లీగల్ ఆఫీసర్ ప్రొఫెసర్ టి.సీతా కుమారి మాట్లాడుతూ జూనియర్ విద్యార్థినులకు స్నేహాన్ని పంచి ప్రశాంతమైన వాతావరణంలో వారు చదువుకునేలా అవకాశం కల్పించాలని సీనియర్ విద్యార్థినులను కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ ప్రొఫెసర్ టి.మల్లికార్జున రావు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థిని భార్గవికి అభినందనలు



న్యాయ విజ్ఞాన సదస్సుకు హాజరై వచ్చిన భార్గవిని అభినందిస్తున్న వీసీ ఆచార్య ఉమ

తిరుపతి రూరల్ : శ్రీపద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలోని న్యాయశాస్త్ర విభాగంలో చదువుతున్న విద్యార్థిని భార్గవి నూకతోటి అమెరికాలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్నారు. ఐదు వారాల శిక్షణతో పాటు అంతర్జాతీయ స్థాయిలో జరిగిన సదస్సుకు హాజరై భారత దేశంలోని చట్టాలు, న్యాయ వ్యవస్థ గురించి సమగ్రంగా వివరించారు. ఈ సదస్సుకు భారతదేశంతో పాటు దక్షిణ కొరియా, శ్రీలంక, మలేషియా, బోస్నియా, హెర్జెగోవినా, జాంబియా, కజకిస్తాన్ నుంచి 19 మంది న్యాయశాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు. తిరిగి యూనివర్సిటీకి చేరుకున్న విద్యార్థిని భార్గవిని వీసీ ఆచార్య ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య రజినితో పాటు సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి అభినందించారు. న్యాయశాస్త్ర విభాగాధిపతి, ఫ్యాకల్టీ సభ్యుల ప్రోత్సాహానికి భార్గవి నూకతోటి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



విశేష అలంకరణలో అమ్మవారు



ఆలయం ముందు నైవేద్యాలు సమర్పిస్తున్న మహిళలు

కరుణించమ్మా..

వైభవంగా రేణిగుంట గంగమ్మ జాతర

- పొంగళ్లు సమర్పించిన మహిళలు
- పోటెత్తిన భక్తజనం

రేణిగుంట: కాపాడరావమ్మా.. గంగమ్మా అంటూ గ్రామదేవత గంగమ్మను భక్తజనం కొలిచారు. మంగళవారం రేణిగుంట గంగ జాతర సందర్భంగా సూర్యోదయానికి ముందు అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శోభాయమానంగా అలంకరించి భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ధర్మకర్త సోల మల్లికార్జున్ రెడ్డి తొలి హారతి పట్టి జాతరను ప్రారంభించారు. నూతనంగా అమ్మవారికి బహూకరించిన బంగారు పూత వెండి కవచాన్ని అలంకరించడంతో ఈ సంవత్సరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ ఆవరణలో సింహ వాహనంపై అమ్మవారి ప్రతిమను అధిష్టింపజేసి చేపట్టిన విశేష పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం నడివీధి గంగమ్మ త్రిశూలం వద్ద గంగమ్మ తల్లికి రాగి అంబలి పోసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మహిళలు గంగమ్మ ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

గంగమ్మకు సారె



అమ్మవారి సేవలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

గంగమ్మ జాతర సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మంగళవారం గంగమ్మ తల్లికి సారె సమర్పించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహం వద్ద ఎమ్మెల్సీకి ఆలయ మర్యాదలతో కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అర్చకులకు సారెను అందించి, అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిపాయి మాట్లాడుతూ ముందుగా గత 20 ఏళ్లుగా గంగజాతరలో పాల్గొంటున్నానని తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేశం, ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ ఉల్లా, వీఆర్ రావణ, వన్నెకుల సంఘం నాయకులు దాము, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మా మీద దయ చూపరా..!

- పెండింగ్‌లో 6 విడతల రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- విద్యాశాఖ మంత్రికి విన్నవించినా స్పందన కరువు
- అయోమయంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు
- నేడు తాడేపల్లిలో ఏపీ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన

ఉమ్మడి జిల్లా సమాచారం

ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	108
చదువుతున్న విద్యార్థుల సంఖ్య	47,360
పెండింగ్‌లో ఉన్నది	6 విడతలు
బకాయిలు మొత్తం	రూ.330.15 కోట్లు
ఒక్కో డిగ్రీ కళాశాలకు సుమారు	రూ.3.05 కోట్లు
ఒక్కో విద్యార్థికి సరాసరి అందాల్సిన మొత్తం	రూ.18,000

తిరుపతి సిటీ: కూటమి ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ రెండేళ్ల బకాయిలు చెల్లించకపోవడంతో అటు విద్యార్థులు, ఇటు డిగ్రీ ప్రైవేటు కళాశాలలు దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఈ ఏడాది డిగ్రీ అడ్మిషన్లు ఇప్పటి వరకు జరగకపోవడంతో పాటు 2023 నుంచి 2025 వరకు ప్రభుత్వం నుంచి సుమారు ఆరు విడతల బకాయిలు అందకపోవడంతో కళాశాలలను ఎలా కొనసాగించాలో అర్థం కాని పరిస్థితిలో యాజమాన్యాలు తలపట్టుకుంటున్నాయి. ఏడాది నుంచి పలుమార్లు విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కలిసి విన్నవించినా స్పందన లేదు. దీంతో ఏపీ ప్రైవేటు డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ఏపీపీడీసీఎంఏ) ఆధ్వర్యంలో తాడేపల్లిలోని సోషల్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు శాంతియుతంగా ధర్నా నిర్వహించి తమ సమస్యలను ప్రభుత్వానికి విన్నవించాలని సిద్ధమయ్యారు.

6 విడతల బకాయిలు సుమారు రూ.330.15 కోట్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సుమారు 108 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉండగా అందులో 85 కళాశాలలు ఎక్కువ మంది విద్యార్థులతో కొనసాగుతున్నాయి. గత మూడేళ్లుగా 6 విడతల ఫీజురీయింబర్స్‌మెంట్ సుమారు రూ.330.15 కోట్లు ప్రభుత్వం బకాయిలు పెట్టింది.

ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాం



ఆరువిడతల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులతో కూరుకుపోయాం. కనీసం నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో ఉద్యోగులకు, అధ్యాపకులు జీతాలు ఇవ్వలేని దుస్థితి. కళాశాల నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణం బకాయిలను విడుదల చేయాలి. – పట్నం సురేంద్రరెడ్డి, ప్రైవేటు డిగ్రీ కాలేజీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

తక్షణం విడుదల చేయాలి

పెండింగ్ రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి. గత 6 విడతలకు సంబంధించి సుమారు జిల్లాకు రూ.330 కోట్లు రావాల్సి ఉంది. ఇంటర్మీడియట్ ఫలితాలు వచ్చి నాలుగు మాసాలు గడుస్తున్నా ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ రాకపోవడం విచారకరం. ఈ ఏడాది కళాశాలలో కనీసం 50 శాతం అడ్మిషన్లు జరుగుతాయనే నమ్మకం లేదు. సింగిల్, డబుల్ మేజర్ అంటూ డిగ్రీ అడ్మిషన్ల విషయంలో అయోమయం నెలకొంది. – ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు, తిరుపతి జిల్లా

మాజీ ఎమ్మెల్యే చెంచురెడ్డికి నివాళి



మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తున్న తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు, మాజీమంత్రి నారాయణస్వామి, ఎమ్మెల్సీ సిపాయి

శ్రీకాళహస్తి: జిల్లాలో సీనియర్ పొలిటీషియన్, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి పార్థివదేహానికి పలువురు నేతలు నివాళులు అర్పించారు. మంగళవారం ఆయన స్వగృహంలో మృతదేహాన్ని సందర్శనార్థం ఉంచారు. అన్ని పార్టీల నాయకులు, స్నేహితులు, బంధువులు, ప్రజలు, భారీగా తరలివచ్చి ఆయన పార్థి వ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, గుమ్మడి బాలకృష్ణయ్య, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, సిద్ధగుంట సుధాకర్ రెడ్డి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ పఠాన్ ఫరీద్, యువజన విభాగం అధ్యక్షుడు శ్రీవారి సురేష్, దేవస్థానం మాజీ బోర్డు మెంబర్లు మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్ రాయల్ తదితరులు ఉన్నారు. అలాగే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కూడా మాజీ ఎమ్మె ల్యే చెంచురెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు.

క్రీడా ప్రతిభా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి(ఈ నెల 29వ తేదీ)ని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా పలు క్రీడల్లో ప్రతిభ చూపిన వ్యక్తిగత, పాఠశాలల జట్లకు క్రీడా ప్రతిభా అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కేవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25లో స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ చూపిన పాఠశాలలకు టీమ్ ఈవెంట్స్, వ్యక్తిగత ఈవెంట్ల విభాగంలో ఈ అవార్డులు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రతిభ చూపిన వారు ఈ నెల 18వ తేదీలోపు దరఖాస్తులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పవర్ ఏ ఒక్కరిదీ కాదు.. అందరిదీ!

- బీజేపీ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదు
- మమ్మల్ని ఎవరైనా తక్కువ చేస్తే ఊరుకోం
- కార్యకర్తల సమావేశంలో కోలా ఆనంద్, దయాకర్‌రెడ్డి హాట్ కామెంట్స్

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ''పవర్ ఏ ఒక్కరిదీ కాదు.. అందరిదీ. ఒక్కరి వల్ల రాష్ట్రంలో విజయం రాలేదు'' అని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, మరో నేత దయాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు టీడీపీ, జనసేనలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పర్యటన సందర్భంగా తిరుపతిలో మంగళవారం కచ్చపి ఆడిటోరియంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీజేపీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని.. ఎమ్మెల్యేలు ఎవరూ బీజేపీ నాయకులు, కార్యకర్తలను పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. అధికారం ఒక్క పార్టీ వల్లో, ఏ ఒక్కరి వల్లో రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా తిరుపతి మాజీ ఎంపీ వరప్రసాద్ తీరును ఎండగట్టారు. రాష్ట్రంలో బీజేపీ శ్రేణులకు జరుగుతున్న అన్యాయాల గురించి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కూర్చుని చర్చించాలని కోలా ఆనంద్ డిమాండ్ చేశారు. పార్టీని, కార్యకర్తలను తక్కువ చేసి మాట్లాడితే ఊరుకునేది లేదని మరో బీజేపీ నేత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి టీడీపీ, జనసేన నేతలకు పరోక్షంగా హెచ్చరికలు చేశారు. కూటమి ప్రభుత్వంలో సఖ్యత లోపించిందని.. నామినేటెడ్ పదవుల విషయంలో అన్యాయం జరిగిందని ఆరోపించారు. రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సమక్షంలో బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలు కూటమి పార్టీల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

చాయ్ పే చర్చ



శోభయాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి గాంధీరోడ్డు: తిరుపతిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మంగళవారం ఉదయం చాయ్ పే చర్చ కార్యక్రమం ఉదయం 7.30 గంటలకు బాబు జగ్జీవన్ రావు పార్క్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలు, ప్రజలతో మమేకమై సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఉదయం 9 గంటలకు శంకరంబాడికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం లీలామహల్ కూడలి నుంచి శోభాయాత్రగా కచ్చపి ఆడిటోరియానికి చేరుకున్నారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు. తరువాత సాయంత్రం 5 గంటలకు మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులతో సమావేశమయ్యారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, వైద్యాధికారులు

తిరుపతి అర్బన్: హెచ్ఐవీ పట్ల అందరికీ అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో పాటు వైద్యాధికారులతో కలసి హెచ్ఐవీని గురించి చర్చిద్దాం..హెచ్ఐవీని నివారిద్దాం అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి హెచ్ఐవీ వ్యాప్తి చెందకుండా చేపట్టాల్సిన అంశాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు.ఆ మేరకు అందరికి కరపత్రాలను అందించాలని సూచించారు.

జీవితాలను విచ్ఛిన్నం చేసుకోవద్దు



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ

తిరుపతి తుడా: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారి వారి ఆధ్వర్యంలో మంగళవారం హెచ్ఐవీ ఎయిడ్స్, మాదకద్రవ్య వ్యసనాలపై యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలకృష్ణనాయక్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కోటి రెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను విచ్ఛినం చేసుకోవద్దన్నారు. ర్యాలీలో మెడికల్, స్వచ్ఛంద సేవ సంస్థల సిబ్బంది, యువత, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు షార్‌లో జాతీయ అంతరిక్ష దినోత్సవం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) దేశంలోని అన్ని సెంటర్లలో జాతీయ అంతరి క్ష దినోత్సవాలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో బుధ వారం ఉదయం షార్ కేంద్రంలో కూడా ప్రారంభించేందుకు సన్నాహాలు చేశారు. బుధవారం షార్ డైరెక్ట ర్ ఈఎస్ పద్మకుమార్ ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో భాగంగా ఇస్రో తన సుదీర్ఘమైన అంతరిక్ష ప్రయాణంలో ఎన్నో కష్టాలు, ఎన్నో ఒడిదుడుకులు, ఎన్నో విజయాలతో కూడిన సంబరాలు ఒక్కసారి గుర్తు చేసుకుంటూ విద్యార్థులకు అనేక రకాల పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం నుంచి వారం రోజుల పాటు అంటే ఈనెల 23 దాకా కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బుధవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు.

రెట్టింపు నగదు చెల్లించండి

- ధాన్యం కొని రైతులకు డబ్బులివ్వకుండా మోసం చేసిన కర్ణాటక వ్యాపారి
- 18 నెలలు జైలుశిక్ష విధించిన జడ్జి

వెంకటగిరి(సైదాపురం): రైతుల నుంచి పంటను కొనుగోలు చేసి నగదు ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తికి 18 నెలలు జైలుశిక్షతో పాటు సదరు రైతులకు రెట్టింపు నగదు జమ చేయాలని వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి విష్ణువర్మ మంగళవారం తీర్పునిచ్చారు. వివరాలు ఇలా.. ఏర్పేడు మండలం పల్లాం గ్రామ రైతులు 2023 మార్చిలో వరి ధాన్యం సుమారు 1700 బస్తాలను వెంకటగిరికి చెందిన ఓ దళారీ ద్వారా కర్ణాటక రాష్ట్రం ధావణగెరెకు చెందిన శ్రీనివాస్‌కు విక్రయించారు. ఇందుకు గానూ రైతులకు రూ.30.25 లక్షలు చెల్లించాలి. కానీ ఆ నగదు అందించకుండా జాప్యం చేస్తూ వచ్చారు. దీంతో పల్లాం రైతులు, వెంకటగిరికి చెందిన దళారీతో కలసి గత 20 రోజుల కిందట వెంకటగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంకటగిరి పోలీసులు శ్రీనివాస్‌ను వెంకటగిరి కోర్టులో హాజరు పరిచారు. ఈ మేరకు న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో తిరుపతి సబ్‌జైల్‌కు తరలించారు. ఈ మేరకు మంగళవారం నిందితుడు శ్రీనివాస్‌పై నేరం రుజువు కావడంతో 18 నెలలపాటు జైలుశిక్ష విధించి రైతులకు ఇవ్వాల్సిన నగదుతో పాటు రెట్టింపు నగదు రూ.57.61,294 చెల్లించాలని జడ్జి తీర్పునిచ్చారు. నిందితుడు ఈ పరిహారం సకాలంలో చెల్లించకపోతే మరో ఆరు నెలలు జైలు శిక్షపాటు తగు చర్యలు తీసుకోనున్నట్లు తీర్పునిచ్చారు. ఈ మేరకు నిందితుడు శ్రీనివాస్‌ను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. అయితే నిందితుడు శ్రీనివాస్ మరి కొందరికి కూడా రూ.1.5 కోట్ల వరకు మోసం చేసినట్లు సమాచారం.

ఏనుగుల కట్టడికి కేంద్రానికి ప్రతిపాదనలు

తిరుపతి మంగళం : శేషాచల అడవుల్లో నుంచి ఏనుగుల గుంపులు పంట పొలాల్లోకి, జనావాసాల్లో రాకుండా చర్యలు చేపట్టేందుకు అటవీశాఖ నుంచి కేంద్ర ప్రభుత్వానికి రూ.11 కోట్లకు ప్రతిపాదనలు పంపామని తిరుపతి సబ్‌ఈఎఫ్‌ఓ నాగభూషణం తెలిపారు. తిరుపతి కపిలతీర్థం సమీపంలోని అటవీశాఖ సబ్‌డీఎఫ్‌ఓ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఏనుగుల గుంపులు శేషాచల అడవుల్లోకి వస్తున్నాయని, అక్కడ నుంచి పంట పొలాలపై పడి నాశనం చేస్తూ.. జనాలపై దాడులకు తెగబడుతున్నాయని తెలిపారు. అలా జరుగుతున్న నష్టాలపై అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కర్ణాటక, తమిళనాడు, ఏపీ రాష్ట్రాల నుంచి ముగ్గురు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను టీంగా ఏర్పాటు చేసిందన్నారు. వారు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చే నివేదిక ఆధారంగా నిధులు మంజూరు అవుతాయన్నారు.

తెలుపు చూస్తే ఏనుగులకు ఆగ్రహం

సహజంగా ఏనుగులకు తెలుపు రంగు కంట పడితే ఎక్కడలేని ఆగ్రహం వస్తుందని తిరుపతి సబ్ డీఎఫ్‌ఓ నాగభూషణం తెలిపారు. శేషాచల అడవుల్లో 32 ఏనుగులు ఉన్నాయని, వాటిలో కొన్ని జనావాసాల్లోకి వచ్చి పంటలకు నష్టం కలిగించి వెళ్తున్నాయని అన్నారు. ఏనుగులు వచ్చినప్పుడు టపాకాయలు పేల్చడం, డప్పులు, డబ్బాలు కొట్టడం, విజిల్లు వేయడం వంటివి చేయకూడదన్నారు. ఏనుగుల దాడుల్లో నష్టపోయిన బాధితులకు పరిహారం కూడా చెల్లిస్తున్నామని తెలిపారు.